క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

మెళియాపుట్టి: వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీల ద్వారా విద్యలో మరింత పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. చదవటం ద్వారా చక్కటి ప్రతిభ పెరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఆమదాలవలస: సామాజిక సేవలు సంతృప్తి ఇస్తాయని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొల్లి తోషిక అనే చిన్నారి పుట్టినరోజు సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆమదాలవలస పట్టణంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా పలు సాంఘిక, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే రక్తదాన శిబిరాలు, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, సురేష్, ప్రదీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాలు నిషేధం



మాట్లాడుతున్న మహమ్మద్ యాసిన్

పాతపట్నం: గ్రామాల్లో విజయోత్సవాలు, మందుగుండు సామగ్రి కాల్చవద్దని, ర్యాలీలు నిర్వహించకూడదని పాతపట్నం ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు వైన్ షాపులు మూసివేయించామన్నారు. ఎవరైనా మందు రవాణా చేసినా, మందు అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని గ్రామాల్లో పోలీసు నిఘా ఉందని, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా శాంతిభద్రతలకు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేయటంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని సరుబుజ్జిలి ఎస్సై బి.నిహార్ హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున బాణసంచా కాల్చటం, ఊరేగింపులు నిర్వహించటం, స్వీట్స్ పంచటం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించవద్దన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమాలనులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా మసులుకోవాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బూర్జ: మండల కేంద్రంలో గల జగన్నాథ స్వామి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 6వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాన అర్చకులు గోపీస్వార సాహు ఆధ్వర్యంలో భక్తు ప్రత్యేక పూజలు, దర్శనాలు, భజనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం




ఆటో వెనుక భాగంలో కూర్చుని ప్రయాణిస్తున్న మహిళలు

సరుబుజ్జిలి: ప్రమాదమని తెలిసికూడా ఆటో వెనుకవైపు కూర్చొని ప్రయాణాలు చేసి ప్రాణాలు కోల్పోతున్నారు. గమ్యస్థానాలకు వెళ్లేందుకు వేలాడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నేడే ఉత్కంఠతకు తెర

- సాయంత్రం మూడు గంటకల్లా తేలనున్న నరసన్నపేట నియోజకవర్గ ఫలితం
- శ్రీముఖలింగం నుంచి కౌటింగ్ ప్రారంభం
- పోలాకి మండలం జిల్లోడు మాకివలసతో ముగింపు



ధర్మాన కృష్ణదాస్ (వైఎస్సార్‌సీపీ)



బగ్గు రమణమూర్తి (టీడీపీ)

నరసన్నపేట: ఓటర్లు, అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సమయం వచ్చేసింది. మంగళవారం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. నరసన్నపేట నియోజకవర్గ ప్రజలతోపాటు జిల్లా వాసులు అందరిలో నెలకొన్న ఉత్కంఠతకు తెరపడనుంది. పోలింగ్ తరువాత చిలకపాలెం వద్ద శివానీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఈవీఎంలు భద్రపరిచారు.

నరసన్నపేట నియోజకవర్గంలో 2,14,866 మంది ఓటర్లు ఉండగా 1,77,145 పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3,279, సర్వీసు ఓట్లు 907 వచ్చాయి. మొత్తం ఏడుగురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ప్రధాన పోటీ మాత్రం టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మధ్యే నెలకొంది. ప్రచారంలోనూ, పోల్‌మేనేజ్‌మెంట్‌నూ ఈ రెండు ప్రధాన పార్టీలు పోటాపోటీగా తలపడ్డాయి. రెండు పార్టీలు గెలుపుపై ధీమాగా ఉన్నాయి.. ఓటరు నాడి మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌కు అనుకూలంగా ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. టీడీపీకి చెందిన కార్యకర్తలు, నాయకుల నుంచి పోలింగ్ అనంతరం సేకరించిన సమాచారంతో గెలుపుపై ఆ పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి కూడా ఆశలు పెట్టుకున్నారు.


పందెంరాయుళ్లల్లో పెరుగుతున్న టెన్షన్..!

నాయకులు, కార్యకర్తలు ఎవరికివారు గెలుపుపై ధీమాగా ఉండగా.. అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగ్‌లు కట్టిన వారిలో మాత్రం తీవ్ర టెన్షన్ నెలకొంది. నరసన్నపేటలో అభ్యర్థుల గెలుపు పైన, 5 వేల మెజార్టీ పైన పందాలు కట్టారు. ముఖ్యమంత్రి ఎవరనే దానిపై కూడా బెట్టింగ్‌లు జరిగాయి. నాలుగు కోట్ల మేరకు నరసన్నపేట నియోజకవర్గంలో బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం.

21 రౌండ్లలో లెక్కింపు..

నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 21 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. శ్రీముఖలింగంతో ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ పోలాకి మండలం జిల్లోడు మాకివలసతో ముగుస్తుంది. ఒక్కో రౌండ్ లెక్కించేందుకు 30 నిమిషాలు పట్టవచ్చని అంచనా వేస్తుండగా.. మధ్యాహ్నం మూడుగంట కల్లా ఈవీఎంలు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశం ఉంది. అనంతరం లాటరీ పద్ధతిలో వీవీప్యాట్లు 5 ఎంపిక చేసి వాటిని లెక్కిస్తారు. అనంతరం ఎవరు గెలిచారనేది ప్రకటిస్తారు. ఈవీఎంలు లెక్కించేందుకు ముందే పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. వీటి లెక్కింపుతో సంబంధం లేకుండా ఈవీఎంల లెక్కింపు 8.30 కల్లా ప్రారంభిస్తారు.

ఆశల పల్లకిలో అభ్యర్థులు..



పాతపట్నం నియోజకవర్గ చిత్రం

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఓట్లు లెక్కింపు, తుది ఫలితాలు కోసం పోటీలో నిలిచిన అభ్యర్థులతోపాటు ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.. అన్ని వర్గాలవారు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అందరూ ఎదురు చూస్తున్న రోజు జూన్ 4వ తేదీ రానే వచ్చింది. మరికొన్ని గంటల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో.. ఓటర్ల తీర్పు ఎలా ఉందో వెలువడనుంది.

2014 ఎన్నికల్లో...

2014 ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కలమట వెంకటరమణ, టీడీపీ నుంచి మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి పాలవలస కరుణాకర్ ప్రధాన పార్టీ నుంచి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో 1,91,844 మంది ఓటర్లకు గాను 1,40,647 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 20 రౌండ్లలో లెక్కింపు నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసిన కలమట తన సమీప ప్రత్యర్థి శత్రుచర్లపై 3,865 ఓట్లు మెజార్టీతో గెలిపొందారు.

2019 ఎన్నికల్లో...

పాతపట్నం అసెంబ్లీ స్థానానికి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి రెడ్డి శాంతి, టీడీపీ నుంచి కలమట వెంకటరమణ, బీజేపీ నుంచి సలాన రాఘవరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి బాన్న రాము, జనసేన నుంచి గెదేల జ్ఞానసాగర్‌లు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలో 2,16,161 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,52,116 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసిన రెడ్డి శాంతి తన సమీప ప్రత్యర్థి కలమట వెంకటరమణపై 15,551 ఓట్లు మెజార్టీతో గెలిపొందారు.

2024 ఎన్నికల్లో...

గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. వైఎస్సార్‌సీపీ నుంచి రెడ్డి శాంతి, టీడీపీ నుంచి మామిడి గోవిందరావు పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 2,25,313 మంది ఓటర్లకు గాను 1,60,107 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు తీర్పు ఈవిఎంల్లో భద్రంగా ఉన్నాయి. ఫలితాలు వెలువడేందుకు కొన్ని గంటల సమయం మాత్రమే ఉండటంతో గెలుపు తమదంటే.. తమదే అని రెండు పార్టీల నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు.

సాగునీటి కాలువలు బాగుచేయాలి



సరుబుజ్జిలి: పూడికపోయిన కాలువను చూపిస్తున్న రైతులు

సరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువకు సుభద్రాపురం గ్రామం వద్ద అనుసంధానంగా నిర్మించిన 17ఎల్ పిల్ల కాలువ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల రైతులకు సాగునీరు అందక ప్రతి ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుభద్రాపురం వద్ద గల వంశధార కుడి ప్రధాన కాలువ నుంచి సమీపంలో ఉన్న ఇల్లాన్నాయుడు చెరువుకు సాగునీరు నిండిన తదుపరి దిగువన గల నక్కలపేట, పెద వెంకటాపురం, చినవెంకటాపురం, పాలవలస, అవతరాబాద్, సూర్యనారాయణపురం, రావివలస తదితర గ్రామాలకు చెందిన 8 చెరువులు నింపాలి. రైతులకు అత్యవసర సమయంలో సాగునీరు అందించేందుకు అధికారులు నిర్ణయించారు. ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సిన 17ఎల్ పిల్ల కాలువ పూర్తిగా పూడికపోయింది.



బూర్జ: జిలి గెడ్డలో పెరుకుపోయిన పిచ్చిమొక్కలు

గజిలి గెడ్డలో..

బూర్జ: బూర్జ గజిలి గెడ్డలో పూడికలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గజిలి గెడ్డ బిట్–2లో కింద ఏడాది ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడితతీత పనులు చేపట్టారు. అయినప్పటికీ గజిలి గెడ్డలో పిచ్చి మొక్కలు పెరిగి సాగునీటికి ఇబ్బందికరంగా మారాయి. రూ.4,72,340లతో చేపట్టిన పనులు అంతంత మాత్రంగానే జరిగాయని స్థానికుల విమర్శిస్తున్నారు. గెడ్డలో పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో 144 సెక్షన్



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

కొత్తూరు: ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఈ నెల 4 నుంచి 6 తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు ఆటో ద్వారా ముమ్మర ప్రచారం చేయించారు. ఓట్లు లెక్కింపు పూర్తయిన తరువాత గ్రామాల్లో ర్యాలీలు, విజయోత్సవాలతో పాటు బాణసంచా పేల్చడం వంటివి చేపడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మూడు రోజులపాటు తెరవకూడదన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతవరణం ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు



బ్యాలెట్ బ్యాక్సలు తరలిస్తున్న వ్యాన్

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో భద్రపర్చిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను సోమవారం సాయంత్రం ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. పోస్టల్ బ్యాలెట్ బ్యాక్స్‌లను 26 రోజులపాటు పాతపట్నం సీఐ నల్లి సాయి ఆధ్వర్యంలో పోలీసులు భద్రత నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన ఉద్యోగులు మే 4 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,602, హోమ్ సర్వీస్ ఓట్లు 24, సర్వీస్ ఓట్లు 830, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగులు ఓట్లు 84, మొత్తం 3,540 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పింఛన్ పాట్లు



కొత్తూరు సీఎస్‌పీ సెంటర్ వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

కొత్తూరు: పింఛన్ల కోసం పండుటాకులకు రెండో నెల కూడా ఇబ్బందులు తప్పలేదు. ఎన్నికల నేపథ్యంలో సామాజిక పింఛన్లను గ్రామ వలంటీర్ల ద్వారా పంపిణీ చేయకూడదంటూ ఎన్నికల కమిషనర్ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో జూన్ నెలకు సంబంధించి కొంతమంది పింఛన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. పింఛన్ మొత్తాన్ని విత్‌డ్రా చేసేందుకు బ్యాంకులు, సీఈసీ సెంటర్‌ల వద్ద వృద్ధులు గంటల తరబడి నిలబడి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పింఛన్ మొత్తం బ్యాంకు నుంచి తీసుకునేందుకు లబ్ధిదారుడితోపాటు సహాయ కూడా వస్తున్నారు.



కొత్తూరు యూనియన్ బ్యాంకులో పింఛన్ కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

ఏపీజీవీబీ ఖాతాదారుల అవస్థలు



బ్యాంక్ బయట వేచివున్న ఖాతాదారులు

బూర్జ: మండల కేంద్రంలో గల ఏపీజీవీబీలో సోమవారం ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. బ్యాంక్‌కు వివిధ పనులు నిమిత్తం వచ్చినవారు సాయంత్రం వరకు నిరీక్షించావల్సి వచ్చింది. పింఛన్లు, ఖరీఫ్ లోన్లు, నగదు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన వారికి ఇబ్బందులు తప్పలేదు. ఖాతాదారులు బ్యాంకు బయట నిరీక్షించారు. ఆదివారం సాయంత్రం వర్షంతో పాటు పిడుగులు పడటంతో ఇంటర్నెట్‌లో సమస్య వచ్చిందని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు.

తప్పిన ప్రమాదం



సరుబుజ్జిలి: కూలిన శ్లాబు పెచ్చు

సరుబుజ్జిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ గది పైకప్పు సోమవారం కూలిపోయింది. శ్లాబుకు చెందిన పైపెచ్చు ఊడిపోవడం వల్ల సీలింగ్‌కూడా ఊడిపోయింది. ఆ సమయానికి ఆరోగ్య కేంద్రం సిబ్బంది వేరొక గదిలో ఉండడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



సారవకోట: సమావేశ మందిరానికి ఎదురుగా నేలకూలిన చెట్లు

ఈదురుగాలుల బీభత్సం

సారవకోట: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండల పరిషత్ సమావేశ మందిరం ఎదురుగా ఉన్న చెట్లు నేలకొరిగాయి. కొన్ని చెట్లు కొమ్మలు విరిగి సమావేశ మందిరానికి వెళ్లే దారిలో పడిపోయాయి. సోమవారం వీటిని తొలగించే ప్రయత్నాన్ని సంబంధిత సిబ్బంది, అధికారులు చేపట్టలేదు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

రణస్థలం: ప్రతి ఒక్కరూ మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా పతివాడపాలెం శివాలయం ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. హరిబాబు మాట్లాడుతూ భూతాపం బాగా పెరిగిపోయి, దేశంలో పలు నగరాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పి.తవిటినాయుడు, పి.రమణ, వై.లహరి, ఆర్.భవాని, ఎం.వి రత్నాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జి.సిగడాం: సీజనల్ వ్యాధుల పట్ల వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ సూచించారు. మండలంలోని డీఆర్ వలస ఆరోగ్య కేంద్రంలో రోగులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ మంచాలకు పరిమితమైన రోగులకు ఇంటివద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని వెల్లడించారు. వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: సమగ్ర సర్వశిక్ష పథకం అధికారులు సూచనల మేరకు ఎచ్చెర్ల మండలంలో అన్ని గ్రామాల్లో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు సహిత విద్య ఉపాధ్యాయులు సింగిరెడ్డి రమణ, కింతలి అరుణ కుమారి చెప్పారు. ఎచ్చెర్ల భవిత కేంద్రంలో సోమవారం వివరాలు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు సహకారంతో ఈ సర్వే నిర్వహించి చిన్నారులను గుర్తిస్తున్నట్లు వివరించారు. 18 ఏళ్లలోపు దివ్యాంగులను సైతం గుర్తిస్తున్నట్లు వివరించారు. విద్య, పౌష్టికాహారం అందించటం, రవాణా సౌకర్యం కల్పించటం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి సహాయ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దలు సైతం సహకరించాలన్నారు.

మాజీ సైనికులకు ఉచిత వైద్యసేవలు



ఈసీహెచ్‌ఎస్ ప్రత్యేక కౌంటర్ ప్రారంభోత్సవంలో మాజీ సైనికులు, ఆస్పత్రి ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మాజీ సైనికులకు మెడీకవర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆస్పత్రిలో ఈసీహెచ్‌ఎస్ ప్రత్యేక కౌంటర్‌ను డాక్టర్ దానేటి శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికులు, కుటుంబీకులు మెడీకవర్‌లో ఈనెల ఐదో తేదీ నుంచి 24/7 వైద్య సేవలను అందిపుచ్చుకోవచ్చన్నారు. వైద్యానికి అయ్యే ఖర్చు అంతా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆస్పత్రి యాజమాన్యానికి చెల్లిస్తుందన్నారు. ఇక్కడ మాజీ సైనికులకు ప్రత్యేక కౌంటర్ ఉంటుందని చెప్పారు. మాజీ సైనిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికవర్ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం జిల్లా సమాఖ్య తరఫున కృషి చేశామన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఫెడరేషన్ చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు బి.సంజీవరావు, తమ్మినేని కృష్ణారావు, ఎస్.ఎల్.రావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, ట్రెజరర్ ఎం.సింహాచలం, మహిళా సెక్రటరీలు ఎ.లక్ష్మి, కె.జగ్గమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాలు.. వాటి అవశ్యకతపై వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్. శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజు, కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా, వారిలో ఆసక్తిని పెంచేలా వినూత్న రీతిలో వేసవి వినోద కార్యక్రమాలను వచ్చే వేసవిలో రూపొందిస్తామని క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వేసవి వినోదం పేరిట నాలుగు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు వివిధ అంశాల్లో ఎనిమిది రోజులపాటు నిర్వహించిన ఉచిత ప్రత్యేక శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులను అందజేశారు. శిక్షణ శిబిరం బాగా కొనసాగిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి కొత్తకోట అప్పారావు, పొందూరు అప్పారావు, బి.శ్రీరామ్మూర్తి, ఎం.వాసుదేవరావు, ఉపాధ్యాయులు, 90 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రాజాం జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సమ్మర్ క్యాంప్‌లో 14వ (ఏ)బెటాలియన్ జిల్లా ఎన్‌సీసీ విద్యార్థులకు రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన కారక్రమం సోమవారం జరిగింది. జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యత్వంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 512 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు.